# ఆత్మరక్షణ

"యేమమ్మా కామాక్షమ్మా! బ్రామ్మల రామాలయానికి వచ్చినారు! ఆ కోమట్ల అమ్మగారు గుడికే పోకపోయినారా ?"

-కామాక్షమ్మ భక్తితో పట్టిన దోసిట్లో అసహనంగా రెండు పూలేస్తూ, అష్టోత్తరం చదువుతూ ఆచార్లు పెడసరంగా అడిగాడు.

ఆచార్ల మాటలకు కామాక్షమ్మ నివ్వెరపోయింది. 'యెన్నడూ లేంది క్రిష్ణమాచార్ల కేమయింది? తాము బ్రామ్మలం కానట్లు బ్రామ్మల రామాలయం అంటాడేమిటి, కొత్తగా' అనుకుంది. అయోమయంగా జవాబిచ్చింది :

"యే గుడి అయితే నేంలే ఆచార్లూ - భక్తి ముఖ్యంగానీ. పూజారివి నువ్వే అట్లా అంటే! అయినా నీకు తెలియందేముంది? బ్రామ్మల వీథిలోనే వుంటున్న వాళ్ళం, యీ గుడికేకదా మొదటనుంచీ... యీ స్వామినే నమ్ముకున్న వాళ్ళం."

"అదేనమ్మా నేనూ అనేది. మొదటినుంచీ నమ్ముకున్న దానిపట్లనే విశ్వాస ముండాల-మనుషులన్న వాళ్ళకు, యీ విషయం నువ్వయినా చెప్పి శాస్త్రి కింత

గడ్డి పెట్టు. యీ వూళ్ళో పెద్ద పండితుడు, కవి, భగవద్గీతను తానొక్కడే అవపోశనం పట్టినాడని పేరు..."

—ఆచార్లు మనసులోదంతా కక్కేవాడే, పిల్లకపోయింది గుడి కాబట్టి. గుడిలో తాను పూజారి కాబట్టి. ఒక నలుగురు ఆడామగా రావడంతో క్రిష్ణమాచార్లు అర్చనలో దొరబడ్డాడు.

కామాక్షమ్మ అక్కడ నిలవలేకపోయింది. గుడి బయటికి వచ్చింది. గుడి చుట్టు యాంత్రికంగా ప్రదక్షిణయితే ముగించింది. మండపంలో కూచుంది. కానీ ఆమె మనసు మనసులో లేదు కష్టాల్లోవున్న తమ కుటుంబాన్ని, తలచెడి పీథినబడ్డ చెల్లెలు కుటుంబాన్నీ కాపాడమని సీతారాములను వేడుకోడానికి వచ్చిన కామాక్షమ్మ మనసు పూజారి మాటలతో గాయపడింది.

ఆచార్లు నోటి దురుసువాడేంకాదు. మంచిమనిషే ! మరి కుక్కనోట్లో కట్టె పెట్టినట్లు మాట్లాడినాడు. విచిత్రంగా వుంది. యిన్నాళ్ళూ ఆయనంటే యెంత గౌరవం అచార్లకు! తీరికంటూ దొరికితే యింటికొచ్చి గంటల తరబడి ఆయనతో యేవో కవిత్వం గొడవలు, పురాణ చర్చలు చేసేవాడు. ఆయనమీద యెందుకంత మంట గక్కినట్లు? తనంటే యెంత అభిమానం, ఆచార్లకు ! వొక్కో శనివారం గుడికి టెంకాయ తీసుకువెళ్ళలేకపోయినా గుళ్లోని యే కొబ్బరిచిప్పో, యిన్నిన్ని పూలో తట్టలో వుంచేవాడు, బలవంతంగా, ఆత్మీయంగా. అట్లాంటి ఆచార్లు యీవాళ యెందుకంత అవాచ్యంగా గింజుకున్నట్టు ? ఆయన యేదైనా అపచారం చేసినారేమో ! లేకపోతే ఆచార్లు ఆయన్ను అంతంత మాటలంటాడా...గడ్డి పెట్టమని...వయసైనా చూడకుండా...

కామాక్షమ్మ మనసు పరి పరి విధాల పోయింది.

నెల రోజులుగా తాను వూర్లోలేదు. చెల్లెలు దగ్గర వుంది, దాని గోడు పంచుకుంటూ. యిక్కడ యేదో గొడవ జరిగి వుంటుంది, తప్పక. యేంగొడవో ? యేంపీడో? ఆ తల తిక్క మనిషి యేదో చేసివుంటాడు. చేసేవన్నీ శూద్ర సవాసాలే అయినప్పుడు యేదో చెయ్యకుండా వుంటాడా ? కొంపదీసి చెల్లెలు మొగుని మాదిరి యే... అది వుండదు. అది వుండదు... అయినా మగవాళ్ళను నమ్మి చచ్చేదెవరు? వయసు పైబడితే మాత్రం బుద్ధులు సరిగా వుండద్దూ...

కామాక్షమ్మ ఆలోచనలను ఒక కొలిక్కి తెచ్చుకోవాలని ప్రయత్నించింది. "వొసేవ్ కామాక్షీ !" అనే పిలుపు వినేవేళకు కామాక్షమ్మ గుండెలు గుబగుబలాడాయి.

ఆ వచ్చేది శేషమ్మ...రోజూ గుళ్లో గీత వినడానికని వచ్చే శేషమ్మ... దాని నోరు అసలే మంచిది కాదు... రంకు పురాణాలన్నీ దాని కొంగులోనే...

తరిమినట్లు గుళ్ళోనుంచీ బయటికి వచ్చి, కామాక్షమ్మ యింట్లో పడింది.

యిల్లు చేరినా, గుళ్ళో ఆచార్ల పుల్లవిరుపు మాటలు కామాక్షమ్మ గుండెను తొలుస్తూనే ఉన్నాయి. ధ్యాస మళ్ళుతుందని వంట ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఉదయం తాను, చెల్లెలు వాళ్ళ వూరిదగ్గిరి నుండీ వచ్చేప్పుడు, చెల్లెలు సంచిలో వుంచిన సొరకాయను కోసి, ముక్కలు తరగడం మొదలు పెట్టింది. చెల్లెలూ, ఆమె పిల్లలూ జ్ఞాపకానికి వచ్చారు. కామాక్షమ్మ గుండె మరింత బరువెక్కింది.

తమ అయిదుగురు అక్కచెల్లెండ్లలో కడగొట్టు దాని జీవితమే మెరుగను కున్నారు, నలుగురూ. పల్లెటూరి కిచ్చినా ఆస్తి యేదో వుందనుకుంటే, దాని మొగుడు అడ్డమైన తిరుగుళ్ళూ తిరిగి సంసారాన్ని గుల్లచేసినాడు. గుల్లచేసి, 'వైదీకులది ముష్టి బ్రతుకే, ముష్టెత్తుకొని చావండర్రా' అని పెళ్ళాన్నీ, నలుగురు పిల్లల్నీ వీథిని బడేసి చచ్చినాడు. బ్రాహ్మణ పుటక పుడితేనేం – శూద్రసావాసాలు శూద్రబుద్ధులూ వున్నాక ? తానేమో తంటా తీరిపోయినట్లు చచ్చినాడు. చెల్లెలూ, దాని పిల్లలు బ్రతుకు యెట్లా తెల్లవారుతుందో... ?

తన బ్రతుకు మాత్రం? యెదుగు బొదుగూ లేని సంసారం. పదేళ్ళుగా యెదిగి గుండెల మీదున్న ముగ్గురు ఆడముండలు; అక్షర ముక్కలబ్బని యిద్దరు కొడుకులు సన్నాసి వెధవలు ! యివేమీ పట్టించుకోని రిటయిరయిన మొగుడు. ఆ మహారాజు యిన్నేళ్ళూ బడిపంతులుగా వుండి కాణీ వెనకేసింది లేదు. కట్టలు కట్టలు కవిత్వం రాస్తాడు. కాగితాలు దండగ. యే గూట్లో చూసినా అవే, అంటు గుడ్డల్లాగా అలుకు గుడ్డలకు పనికొచ్చే శాలువాలు మాత్రం అడపా దడపా వస్తాయి. కూడు చాలని వుద్యోగాలూ, అక్కరకు రాని కవిత్వాలూ, పాండిత్యాలూ. ఆ మధ్య రెన్నెళ్ళ నుండి రామాలయంలో గీతాపారాయణం వొప్పుకున్నదాకా యెన్ని తిప్పలో? ఆ ఫించనేదో పస్తుంది వస్తుందనడమే తప్ప యింకా వచ్చి చచ్చింది లేదు. వచ్చి యెక్కడయినా దోచి పెడుతున్నాడేమో... యేమో... యింట్లో ఆడదానికి తెలియకుండా బయట యెన్ని పనులు చెయ్యరు యీ మగాళ్ళు, చెల్లెలు మొగుడు చేసినట్లు ? వుండవచ్చు. లేకపోతే ఆచార్లు గడ్డి పెట్టమని యెందుకంటాడు. మర్యాదస్తుడు కాబట్టి వివరంగా చెప్పలేదు. అదే శేషమ్మను కలిసి వుంటే బండారం బయట పడేది. చెల్లెలులాగా అవుతుందేమో తన జీవితం...వీథిన బడుతుందేమో !

కామాక్షమ్మ భయంతో వణికిపోయింది.

వంటేదో చేసిందనిపించింది. క్రిష్ణమాచార్ల పెడసరపు మాటలు, తమ గడ్డు జీవితం, వీథిపాలైన చెల్లెలి సంసారం కామాక్షమ్మ మనసును చెదపురుగుల్లాగా కమ్ముకున్నాయి. వుదయం చెల్లెలి వూరి నుంచీ రావడం వల్ల కలిగిన

ప్రయాణపు బడలికతో, ఇంటి చాకిరీతో, ఆలోచనల క్షోభతో అలసిపోయి, కామాక్షమ్మ వో మూల వొరిగి నిద్రపోయింది.

"నిన్నే...తలుపులన్నీ బార్లా తీసేసి నిద్రపోతున్నావు. యింట్లో యేం దెచ్చి పడేసినావులే, యేమైనా దొంగ లెత్తుకపోవడానికి అంటావేమో? ముప్పయి యేళ్ళ నుంచీ రాశిన కవిత్వం కవిలె కట్టలున్నాయి. యెవడు చూసినాడు, నేను పోయినాక వాటిని లోకం గుర్తించవచ్చు. అన్నట్లు పిల్లలంతా యెక్కడకు పోయినట్లు? అందుకేనా నిశ్చింతగా పడకేసినావు. యేం అట్లా చూస్తావేం? గాలేమైనా సోకిందా, నా మీద ."

–జీవితం నెట్టడానికి అలవాటు చేసుకున్న తన హాస్య ధోరణిలో శాస్త్రి గంట కొట్టినట్లు మాట్లాడాడు.

అవమానంతో, కోపంతో, గుండె బరువుతో కామాక్షమ్మకు నోట మాట రాలేదు.

చెల్లెలు కొచ్చిన బాధల్ని తలచుకుంటూ లోలోపల కుమిలిపోతుందేమోనని శాస్త్రి అనుకున్నాడు. బీడి కాల్చుకుని ఓదార్పుగా అన్నాడు :

"అదేమిటే, మీ చెల్లెలూ వాళ్ళను మాటి మాటికి జ్ఞాపకం చేసుకుంటూ వూరికే బాధపడితే యేం లాభం? మనమైనా వాళ్ళను ఆదుకునే స్థితిలో వున్నామా? అంతకంటే హీనంగా వుంది మన పరిస్థితి."

"యెందుకుండదు? వయసు మళ్ళినా పాడుబుద్ధులు పోకుంటే!"

"పాడు బుద్ధులా? యేమిటి నువ్వనేది? యేదో సర్టిఫికెట్టిస్తున్నావు! యీ బీడీలు తాగడం, యీ కాలానికి పద్యాలు గట్రా పనికిరావని తెలిసినా రాయడం, పిల్లలు లేంది చూసి యేదో సరదాగా నీ కొంగు పట్టుకోవడం – యివేగా నా పాడు బుద్ధులు?"

శాస్త్రి వేళాకోళం కామాక్షమ్మ నసాళం తాకింది. ఆవేశం పట్టలేకపోయింది. దాంతో దుఃఖం పొర్లుకొచ్చింది. బెక్కుతూ, బెక్కుతూ అంది :

"యీవాళ గుడిలో తల తీసినట్లయింది. నలుగురూ చుట్టూ లేకపోబట్టి సరిపోయింది. ఆ క్రిష్ణమాచార్లు వయసులో మీకంటే చిన్న. అతననే మాటలు తలుచుకుంటే వొళ్ళు కంపర మెత్తుతుంది."

"యేమంట?"

"మీ కింత గడ్డి పెట్టమన్నాడు!"

"గడ్డా? యిపుడు రోజూ తింటున్నది యేమిటనుకున్నాడో...? పోనీలే. అదార్లంత మాటనడే, వూరికే."

"నాకేం తెలుసు? నెల రోజులుగా వూళ్ళో వుండి చచ్చినానా, యేమన్నా యీ నెల రోజులూ ఆ చెల్లెలు ముండ గోడు చూళ్ళేక చచ్చి, యిక్కడికొస్తే యిదో యాతన. యేమీ చెయ్యంది యెందుకంటూ రెవరన్నా?"

"నే నేమన్నా చెయ్యడమా? యే సందర్భంలో అన్నాడో చెప్పు."

"ఆఁ సందర్భమూ చట్టుబండలూ. గుడిలోకి పోతూనె అదేదో మాదిరిగా 'యేమమ్మా కామాక్షమ్మా బ్రాహ్మల రామాలయానికి వచ్చినారు, ఆ కోమట్ల అమ్మవారు గుడికే పోకపోయినారా' అన్నాడు."

"యిక చెప్పొద్దులే. అర్థమయింది అసలు విషయం. వోరి ఆచార్లూ..." శాస్త్రి పగలబడి నవ్వడం మొదలుపెట్టేడు.

"మీకు ప్రతిదానికి నవ్వే." విసుగ్గా అంది కామాక్షమ్మ.

"బ్రాహ్మల రామాలయం, వాడి శ్రాద్ధం. కోమట్ల అమ్మవారి గుడీ, వాడి తలకాయ. బ్రతుకుదెరువు బేరంలో కులాలవారీ దేవుళ్ళ పంపకం. అసలు యేడుపు అదికాదు. ఆచార్లూ వాళ్ళ కడుపు నేనేదో కొట్టానని. ఆ కడుపు మంట నీ దగ్గిర వెళ్ళగక్కినాడు."

"అంటే?"

"ఆత్మ రక్షణ పోటీలో వోడిపోతే కడుపు మంట కాదా మరి? అమ్మవారు శాలలో ఆచార్లు నాన్న శేషాచార్లు యిన్నాళ్ళూ పురాణం చెప్పేవాడా? ఆయన్ను వద్దని యిప్పుడు నన్ను కోమట్లు 'గీత' చెప్పమన్నారు. భక్తియోగంలో నుంచి కోమట్లు కర్మయోగంలో పడడంతో యీ తంటా."

"అయితే రామాలయంలో మీ రొప్పుకున్న గీతాపారాయణం..."

'వొకే టయంలో రెండు గుళ్ళలో గీతబోధ చెయ్యడానికి నేనేం కృష్ణ పరమాత్మనా? రామాలయంలో రోజు కిచ్చేది అయిదు రూపాయలు. అమ్మవారి గుళ్లో రోజుకు పది. రిటరయినాక మన వైభోగం రోజురోజుకూ పెరుగుతుందాయె. కాబట్టే బ్రాహ్మణ గుడి అయిదు కంటే కోమట్లగుడి పది మనకెక్కువ అవసరం. రామాలయం మానేసి కోమట్లగుళ్లో అందుకే వొప్పుకున్నా. కృష్ణమాచార్లు వాళ్ళకు రోజుకు వొక అయిదు రూపాయలు సంపాదన పోయింది. మనకు అయిదు పెరిగింది. దానికే ఆచార్లు నా కంత గడ్డి పెట్టమన్నాడు, తమ నోటి దగ్గర గడ్డి పోయింది కదా అని. నోటి దగ్గర గడ్డి తగాదా మరి?'

శాస్త్రి మాటల్లోని ఆవేదననూ, వ్యంగ్యాన్నీ, కరుకుదనాన్నీ కామాక్షమ్మ పట్టించుకోలేదు. భర్త ప్రయోజనత్వానికి ఆనందపడుతూ మెచ్చుకోలుగా అంది :

"అమ్మ! యేమిటో అనుకున్నాను. మనసంతా పాడు చేసుకున్నాను. మిమ్మల్ని తిట్టుకున్నాను. ఛీ ఛీ."

"అదా ఆదార్ల కడుపుమంట? యాదముండా కొడుకు! యిన్నాళ్ళూ ఆ కోమట్ల గుడి సంపాదనే గతికి యిప్పుడు మనల్ని దెప్పిపొడుస్తాడా? నీతులు మాట్లాడతాడా? యిన్నాళ్ళూ మంచివాడనుకున్నా. వెధవ బుద్ధీ వాడూ"

"బుద్ధి దేముంది? వెధవో సధవో. అవసరాన్ని బట్టి మారుతుంది. రేపో మాపో యే స్వాములవారో చాతుర్మాస్య వ్రతం పేరుతో, యీ వూళ్ళో తిష్ట వేసినాడనుకో. మన నోట్లో దుమ్ము. అప్పుడు మన బుద్ధు లంతకంటే బాగా యేడుస్తాయా?"

–శాస్త్రి నీరసంగా, సాలోచనగా అన్నాడు.

"అట్లాంటి అవాచ్యపు మాట లనకండి. భయమేస్తుంది," కామాక్షమ్మ భయంగా అంది.

"అవాచ్యపు బ్రతుక్కంటేనా?" ఆరిపోయిన బీడి ముక్కను విసిరికొడుతూ శాస్త్రి ప్రశ్నించాడు.

శాస్త్రి ప్రశ్నతో కామాక్షమ్మకు భవిష్యత్తు యిప్పటికంటే అస్థిరంగా, విపరీతంగా, భయంకరంగా కళ్ళల్లో మెదలసాగింది.

○ జనవరి 1977, వీచిక మాసపత్రిక